18-10-2022 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - తాబేలు వలె మొత్తమంతా ఇముడ్చుకుని మౌనంగా కూర్చుని స్వదర్శన చక్రాన్ని తిప్పండి, సర్వ సంబంధాల సాక్కిరిన్ అయిన తండ్రి ఎవరైతే ఉన్నారో, వారిని స్మృతి చేసినట్లయితే మీ వికర్మలు వినాశనమవుతాయి"

ప్రశ్న:- ఈశ్వరీయ కులానికి చెందిన పిల్లల కోసము తండ్రి ఇచ్చే శ్రీమతము ఏమిటి?

జవాబు:- మీరు ఈశ్వరునికి పిల్లలుగా అయ్యారు, వారి సమ్ముఖంలో కూర్చున్నారు కావున వారిని ప్రేమగా స్మృతి చేయండి. వారి శ్రీమతంపై నడవండి. వారిని ఎంతగా స్మృతి చేస్తారో, అంత నషా ఉంటుంది. కానీ మాయా రావణుడు - అతని కస్టమర్లను లాక్కుంటున్నట్లు గమనిస్తాడు కావున అతను కూడా యుద్ధం చేస్తాడు. బాబా అంటారు - పిల్లలూ, బలహీనంగా అవ్వకండి. నేను మీకు శక్తిని ఇవ్వడానికి కూర్చుని ఉన్నాను.

గీతము:- ఓర్పు వహించు మానవా... (ధీరజ్ ధర్ మనువా...)

ఓంశాంతి. పిల్లలను, ఓ పిల్లలూ అని ఎవరంటారు, ఎందుకంటే మానవా అని ఆత్మను అనడం జరుగుతుంది. ఆత్మలోనే మనస్సు-బుద్ధి ఉన్నాయి. అందుకే ఈ పేరును కూడా పెట్టారు. చాలా వస్తువులకు చాలా పేర్లు పెట్టారు, ఉదాహరణకు పరమపిత పరమాత్మ అని, బాబా అని అంటారు, కొందరేమో ఫాదర్ అని అంటారు. బాబా అన్న పదము అన్నింటికన్నా సింపుల్. బాబా అంటారు - మీరు ఎవరి సంతానము అన్నది గుర్తుకొస్తుందా? ఇప్పుడు పిల్లలైన మీరు కూర్చున్నారు, ఎదురుగా ఎవరున్నారు? బాబా కూర్చున్నారు అని ఆత్మలు అంటారు. ఎంత సింపుల్ విషయము. ఆత్మలమైన మనకు తండ్రి పరమపిత పరమ ఆత్మ అని పిల్లలకు తెలుసు. మనుష్యులైతే చిన్నవారిని, పెద్దవారిని అందరినీ బాబా అని అంటారు మరియు ఇక్కడేమో ఆత్మ తన బాబాను బాబా అని అంటుంది. ఓ గాడ్ ఫాదర్ అని అంటారు. ఇప్పుడు శారీరక తండ్రినైతే గాడ్ ఫాదర్ అని అనరు. మనం ఆ బాబా ఎదురుగా కూర్చున్నామని మీకు తెలుసు, ఇది ఆత్మకు సంబంధించిన విషయము. తాను ఎవరు అన్న విషయాన్ని శివబాబా అర్థం చేయిస్తారు! నేను పరమ ఆత్మను. నేను ఆత్మలైన మీ అందరి యొక్క పరంధామంలో నివసించేటువంటి తండ్రిని, అందుకే నన్ను పరమ ఆత్మ అని అంటారు. రెండు పదాలు కలిపినట్లయితే పరమాత్మ. ఇది ఎంత సహజము. ఇక్కడ ఎవరు కూర్చున్నారు? శివబాబా, వారు లేకపోతే ఈ బ్రహ్మ కూడా ఉండేవారు కాదు. పిల్లలైన మీ హృదయంలో ఎల్లప్పుడూ వారి స్మృతి ఉంటుంది. వారు కూడా ఆత్మనే, తేడా ఏమీ లేదు. ఏ విధంగానైతే ఆత్మ నక్షత్రము, ఆ నక్షత్రం యొక్క సాక్షాత్కారం జరుగుతుంది, అదే విధంగా తండ్రిది కూడా నక్షత్రం రూపములో సాక్షాత్కారం జరుగుతుంది. ఇకపోతే, వారికి చాలా తేజస్సు ఉంటుందని, అది సహనం చేయలేమని ఏదైతే అంటారో, అది మనసు యొక్క భావన. మిగిలినదంతా తండ్రి యథార్థంగా అర్థం చేయిస్తారు - ఆత్మలైన మీరు ఎలాగైతే ఉన్నారో, అలాగే నేను కూడా ఆత్మను. నేను కూడా ఈ తనువులో, ఈ ఆత్మ పక్కన, భృకుటిలో కూర్చోవాల్సి ఉంటుంది. కావున వారు కూర్చుని అర్థం చేయిస్తారు - ఆత్మలైన మీలో 84 జన్మల పాత్ర నిండి ఉంది. అది కూడా ప్రతి ఒక్కరిలో తమ-తమ పాత్ర ఉంది. ఆత్మ, పరమాత్మ చాలా కాలం వేరుగా ఉన్నారు... అని అంటారు. ఇప్పుడు పరమ ఆత్మ అన్న పదము స్పష్టంగా ఉంది. వారిని పరమాత్మ అనడంతో తికమకపడిపోయారు. వారూ ఆత్మ, కానీ వారు సదా పరంధామంలో నివసించే పరమ ఆత్మ. బ్రహ్మను పరమ ఆత్మ అని అనరు. వీరంతా జీవాత్మలు. వీరిలో కొందరు పాపాత్ములు, కొందరు పుణ్యాత్ములు. తండ్రి అంటారు - నన్ను పాపాత్మ లేక పుణ్యాత్మ అని అనరు. నన్ను పరమాత్మ అని మాత్రమే అంటారు. నాకు కూడా పాత్ర ఉంది. ఒకే సారి వచ్చి పతిత ప్రపంచాన్ని పావనంగా చేస్తాను. పతిత-పావనా రండి అని తలచుకుంటారు కూడా. కానీ, తాము పతితులమని, రావణ సంప్రదాయం వారమని ఎవరూ భావించరు. రామరాజ్యం కావాలి అని అంటారు. రావణుడిని కాలుస్తారు కూడా కానీ వారే రావణ సంప్రదాయం వారని తెలియదు. తప్పకుండా పతితులుగా ఉన్నారు, కావుననే పిలుస్తారు. కృష్ణుడిని అలా పిలవరు. వారిని పరమ ఆత్మ అని అనరు. మనందరి తండ్రి, ఎవరైతే పరంధామం నుండి వచ్చారో, వారినే పరమ ఆత్మ అని అంటారు. ఈశ్వరుడు లేక భగవంతుడు అని అనడంతో తికమకపడతారు. తండ్రి ఈ జీవాత్మ ద్వారా అర్థం చేయిస్తారు. మీతో ఈ విధంగా అంటారు - పిల్లలూ, అశరీరి భవ. మీరు నా పిల్లలుగా ఉండేవారు, అప్పుడు మిమ్మల్ని పంపించాను. స్వర్గములోకి శరీరాన్ని ధారణ చేసి వచ్చారు, చక్రంలో తిరుగుతూ-తిరుగుతూ ఇప్పుడు మీరు 84 జన్మల చక్రాన్ని పూర్తి చేసారు. ఈ సమయంలో అందరూ రావణుడి సంతానము. రావణుడే పతితులుగా చేసాడు. ఇప్పుడు మీరు ఈశ్వరీయ సంతానముగా అయ్యారు. ఇప్పుడు బాబా వచ్చారు. వారు అంటారు - ఆసురీ సంప్రదాయాన్ని దైవీ సంప్రదాయంగా తయారుచేయడము నా పాత్ర. నేను కూడా డ్రామానుసారంగా కల్పం యొక్క సంగమయుగంలో నా

సమయానికి వస్తాను. కలియుగము, పతిత పాత తమోప్రధాన ప్రపంచము, ఆ సమయంలో నేను సూర్యవంశ, చంద్రవంశ కులం యొక్క రాజ్యస్థాపన చేయడానికి వస్తాను. అది ఇప్పుడు లేదు కావుననే కదా స్థాపన చేయాలి. ఆ తర్వాత ఎప్పుడైతే సూర్యవంశీయులు, చంద్రవంశీయులు ఉంటారో, అప్పుడు వైశ్య, శూద్రవంశీయులు ఉండరు. ఇప్పుడు మీరు దైవీ సంతానముగా అవ్వడానికి ఈశ్వరీయ సంతానముగా అయ్యారు. కావున, తండ్రితో యోగం ఉండాలి, తద్వారా వికర్మలు వినాశనమవుతాయి. సదా ఆరోగ్యవంతులుగా, సదా ఐశ్వర్యవంతులుగా అవ్వడానికి స్వదర్శన చక్రాన్ని తిప్పాల్సి ఉంటుంది. బాబాను స్మృతి చేయాలి, ఇందులోనే శ్రమ ఉంది. ఎంత సమయం బాబాను స్మృతి చేస్తున్నాను? అన్న చార్టును పెట్టుకోండి. ఎంతగా స్మృతిలో ఉంటారో, అంతగా అతీంద్రియ సుఖపు అనుభూతి కలుగుతుంది. కావుననే అతీంద్రియ సుఖము గురించి అడగాలంటే గోపీ వల్లభుని గోప-గోపికలను అడగండి అని అనడం జరుగుతుంది. వల్లభుడు అని తండ్రిని అంటారు. తండ్రి రూపం కూడా కొడుకులానే ఉంటుంది. అలాగే ఆత్మల తండ్రి కూడా ఆత్మనే, కానీ వారు పరంధామంలో నివసిస్తారు. ఒకవేళ ఆ బీజము కింద చక్రంలోకి వస్తే, వృక్షం పైకి వెళ్ళిపోతుంది. ఏ విధంగానైతే ఆ వృక్షముంటుంది, దాని బీజము కింద, వృక్షము పైన ఉంటుంది. కానీ ఇది తలక్రిందుల వృక్షము, దీని బీజరూపుడైన పరమ ఆత్మ పరంధామంలో నివసిస్తారు. ఆత్మలు కూడా పాత్రను అభినయించేందుకు పై నుండి కిందకు వస్తాయి. శాఖోపశాఖలు వెలువడుతూ ఉంటాయి. ఇప్పుడు తండ్రి అంటారు - మిమ్మల్ని రావణుడు నల్లగా చేసాడు. ఇప్పుడు మీరు తెల్లగా అవ్వాలి. కృష్ణుడిని మరియు నారాయణుడిని, ఇరువురిని నల్లగా చేసేసారు. లక్ష్మిని తెల్లగా చూపిస్తారు, ఎందుకు? కామ చితిపైన ఇద్దరూ కూర్చుని ఉంటారు. కృష్ణుడి గురించి - తక్షక సర్పం వారిని కాటు వేసిందని అంటారు, మరి నారాయణుడిని ఎవరు కాటేసారు? ఏమీ అర్థం చేసుకోరు. చిత్రాలు మొదలైనవన్నీ కూడా రావణుడి మతముపై తయారుచేసారు. శ్రీమతాన్ని ఇచ్చి రావణుడి నుండి విముక్తులుగా చేసేందుకు ఇప్పుడు బాబా వచ్చారు. నేను అందరి సద్గతి దాతను, శ్రీ శ్రీ 108 జగద్గురువు అన్న టైటిల్ కూడా వీరిదే, జగత్తు యొక్క సద్గతి చేస్తారు. గ్రంథ్ లో వీరి మహిమ ఎంతగానో రాయబడి ఉంది. సద్గురువు సత్యమైన చక్రవర్తి, వారు సత్యఖండాన్ని స్థాపన చేసేవారు. బాబాకు ఇవన్నీ కంఠస్థము ఉండేవి. కానీ, అర్థము గురించి తెలియదు. స్వయాన్ని చాలా ధార్మిక మనస్తత్వం కలవారిగా భావించేవారు కానీ రావణుడి కులానికి చెందినవారిగా ఉండేవారు. ఇప్పుడు మీరు ఈశ్వరీయ కులానికి చెందినవారిగా అయ్యారు కావున ఎంత ప్రేమగా వారిని స్మృతి చేయాలి. బాబా, మీరు ఎంత మధురమైనవారు. మమ్మల్ని స్వర్గములోకి తీసుకువెళ్తారు. హెవెన్లీ గాడ్ ఫాదర్ ను ఎంతగా స్మృతి చేస్తే, అంత నషా ఎక్కుతుంది. ఇప్పుడు ఎవరి ఎదురుగా కూర్చుని ఉన్నారు? తండ్రి అంటారు - ఓ గారాబాల పిల్లలూ, నేను మీ పరమపితను, ఆత్మలైన మీతో మాట్లాడుతున్నాను. ఇప్పుడు నా శ్రీమతంపై ఎందుకు నడుచుకోరు. కానీ కామము రూపీ భూతము పడేస్తుంది. తండ్రి అంటారు - బలహీనంగా ఎందుకు అవుతారు? శ్రీమతము లభిస్తుంది కదా, మరి ఆసురీ మతముపై ఎందుకు నడుస్తారు? ఈ యుద్ధము చేయాల్సిందే. నా కస్టమర్లను లాక్కుంటున్నారని మాయ భావిస్తుంది కావున యుద్ధం చేస్తుంది. తండ్రి మీకు శక్తిని ఇస్తున్నారు. ఇంతగా పాఠాలు చదివిస్తున్నారు, అన్ని వేద-శాస్త్రాల సారాన్ని అర్థం చేయిస్తున్నారు. సూక్ష్మవతనంలోనైతే వినిపించరు. విష్ణువు నాభి నుండి బ్రహ్మ వెలువడినట్లుగా చూపించారు. సూక్ష్మవతనంలో నాభి ఎక్కడి నుండి వచ్చింది? ఏమేమి కూర్చుని రాసారు. ఇప్పుడు మీకు ఏదైతే జ్ఞానం లభిస్తుందో, ఇది పరంపరగా నడవదు, ఇక్కడే సమాప్తమైపోతుంది. ఆ తర్వాత శాస్త్రాలు మొదలైనవి ఏవైతే తయారుచేస్తారో, అవి పరంపరగా కొనసాగుతాయి, ఈ జ్ఞానమైతే కనుమరుగైపోతుంది.

ఇప్పుడు తండ్రి అంటారు - నా మతంపై నడవండి, దేహీ-అభిమానులుగా అవ్వండి, ఇందులో రేస్ చేసి నా మెడలో హారంగా అవ్వండి. ఇది బుద్ధికి సంబంధించిన రేస్. సన్యాసులు - అశరీరి భవ, నన్నొక్కరినే స్మృతి చేయండి అని చెప్పలేరు. పరమాత్మయే అందరికీ ఇలా చెప్తారు ఎందుకంటే అందరూ నా సంతానము, అందరినీ తిరిగి తీసుకువెళ్ళడానికి నేను వచ్చాను. కానీ సమ్ముఖంగా వినేది పిల్లలే, మొత్తం ప్రపంచమంతా వినదు. శివరాత్రి జరుపుకుంటారు, శివుని మందిరాలు కూడా ఉన్నాయి. వారు తప్పకుండా వచ్చారు, కానీ శివుని చిత్రము ఇంత పెద్దగా ఉండదు. వారు నక్షత్రము వంటివారు. ఒకవేళ ఇలా చెప్తే, మరి మందిరాలలో ఉన్న చిత్రాలు తప్పా అని అంటారు. అందుకే తండ్రి అర్థం చేయిస్తారు - పిల్లలూ, నేను కూడా ఆత్మనే, కానీ మీరు జనన-మరణాలలోకి వస్తారు, నేను రాను, అప్పుడే కదా నేను మిమ్మల్ని విముక్తులుగా చేయగలుగుతాను. నేను పతిత-పావనుడిని కావున తప్పకుండా పతిత ప్రపంచంలోకే రావాల్సి ఉంటుంది కదా. ఒకవేళ పతిత-పావనుడు అని అనకపోతే - వారు కొత్తగా ప్రపంచాన్ని తయారుచేస్తారని, ప్రళయం జరుగుతుందని, ఆ తర్వాత కొత్త సృష్టిని రచిస్తారని భావిస్తారు. కానీ వారిని పతిత-పావనుడు అని అంటారు కావున దీని ద్వారా - ఈ సృష్టి అనాది అయినదని, దీని ప్రళయం జరగదని నిరూపించబడుతుంది. కేవలం పతితంగా అవుతుంది, దీనిని పావనంగా తయారుచేస్తాను. అందుకే మిమ్మల్ని నరుని

నుండి నారాయణునిగా తయారుచేయడానికి నేను నందిగణముపై లేక భాగ్యశాలి రథముపై వస్తాను. తాము సూర్యవంశీయులుగా అవ్వాలని అందరూ కోరుకుంటారు. ఒక కథ కూడా ఉంది - ఒక భక్తుడు నేను లక్ష్మిని వరించవచ్చా అని అడిగారు! నారదుడు భక్తుడు కదా. అప్పుడు, నీవు నీ ముఖాన్ని చూసుకో, మొదట కోతి నుండి మందిరయోగ్యముగా అయితే అవ్వు, అప్పుడే లక్ష్మిని వరించగలవు అని చెప్పడం జరిగింది. ఇప్పుడు మీరు మందిరయోగ్యులుగా అవుతున్నారు. ఈ విషయమంతా ఈ సమయానికి చెందినదే. ఈ విషయాలన్నీ మీకు ఎవరు చెప్తున్నారు? శివబాబా బ్రహ్మా దాదా యొక్క భృకుటి మధ్యలో కూర్చుని మీకు అర్థం చేయిస్తున్నారు. ఏ విధంగానైతే వీరి ఆత్మ భృకుటి మధ్యలో కూర్చుంది, అంటే తప్పకుండా వారి పక్కనే కూర్చుని ఉంటారు కదా. ఈ నాలెడ్జ్ ఫుల్ తండ్రి మీకు మొత్తం ఆదిమధ్యాంతాల రహస్యాన్ని అర్థం చేయిస్తున్నారు, దీని ద్వారా మీకు స్వదర్శన చక్రం తిప్పడం సహజమవుతుంది. స్వదర్శన చక్రం తిప్పడంతో మీ వికర్మలు వినాశనమవుతాయి, లేదంటే శిక్షలు అనుభవిస్తారు. విజయ మాలలోకి కూడా రారు. ఎప్పుడైతే ఫ్రీగా ఉంటారో అప్పుడు తాబేలు వలె మౌనంగా కూర్చుని చక్రాన్ని తిప్పండి. ఇప్పుడు మీరు తిరిగి ఇంటికి వెళ్ళాలి. ఈ అంతిమ జన్మలో పవిత్రంగా ఉండండి. వీటిని లోకమర్యాదలు అని అంటారు, పతితులుగా అయ్యే మర్యాదలను తెంచండి, ఇంకెవ్వరినీ స్మృతి చేయకండి. మీరు మరణిస్తే మీకు సంబంధించినంత వరకు ప్రపంచమంతా మరణించినట్లే. అశరీరిగా అయి నా వారిగా అయినట్లయితే వికర్మలు వినాశనమవుతాయి. అందరూ తప్పకుండా మరణించాల్సిందే, ఇక ఎవరు ఎవరి కోసం ఏడుస్తారు. హిరోషిమాలో అందరూ మరణించారు, ఏడ్చేవారు ఎవరూ మిగలలేదు, అందుకే ఇప్పుడు ఈ ఏడ్చేటువంటి ప్రపంచం నుండి తిరిగి వెళ్ళాలి. ఈ అశుద్ధమైన ప్రపంచంలో ప్రతి ఒక్కరి అంగ-అంగములోనూ పురుగులు ఉన్నాయి, వాటిని ఎందుకు గుర్తు చేసుకోవాలి. స్వర్గములో ఇటువంటి శరీరాలు ఏమైనా ఉంటాయా. అక్కడైతే అంగ-అంగములోనూ సుగంధము ఉంటుంది. బాబా దుర్గంధమైన వాటిని ఏ విధంగా పుష్పాలుగా తయారుచేస్తారు, కావున వారు రావడం కూడా ఇటువంటి పాత లాంగ్ బూట్ లోకే రావాల్సి ఉంటుంది. బాబా అంటారు - ఇంట్లో ఉన్నా కానీ శ్రీమతంపై నడవండి. వికారాలలోకి వెళ్ళకండి. మీ ఎదురుగా శివబాబా కూర్చున్నారు, వారిని మర్చిపోకండి. అచ్ఛా!

పాట - భూమిని ఆకాశం పిలిచింది... భూమిపై ఉండేవారిని ఆకాశంలో ఉండే తండ్రి పిలుస్తారు. ఇప్పుడు నా వద్దకు రావాలి, అందుకే నష్టోమోహులుగా అవ్వండి. నేను మీకు స్వర్గం యొక్క అపారమైన సుఖాలను ఇస్తాను. తండ్రి అన్ని సుఖాల యొక్క సాక్కిరిన్. మామయ్య, చిన్నాన్న, వీరందరూ మీకు దుఃఖము ఇచ్చేవారు. మీది మొత్తం ఆసురీ ప్రపంచమైన నరకము యొక్క సన్యాసము. సన్యాసులది కేవలం ఇంటి యొక్క సన్యాసము. మీరు ఈ అశుద్ధ ప్రపంచమైన నరకాన్ని మర్చిపోవాలి.

ఈ సమయంలో మనుష్యులకు కాస్త ధనం లభించినా తాము స్వర్గములో ఉన్నారని భావిస్తారు. కానీ ఈ ప్రపంచంలో ఎవరు ఎంత షావుకార్లుగా ఉన్నా కానీ, దివాలా తీస్తే, ఎరోప్లేన్ మొదలైనవి పడితే అంతా సమాప్తము, ఇక ఏడ్వడం, పెడబొబ్బలు పెట్టడం మొదలుపెడతారు. అక్కడైతే ఆక్సిడెంట్ల విషయము ఉండదు. ఎవరూ ఏడ్వరు, పెడబొబ్బలు పెట్టరు. బాబా అంటారు - అచ్ఛా, మీరు స్వర్గములో ఉన్నారనుకుంటే సంతోషపడండి. నరకములో ఎవరైతే పేదవారు ఉన్నారో, నేను వారి కోసము వచ్చాను. దానం కూడా పేదవారికే చేయడం జరుగుతుంది. షావుకార్లు, షావుకార్లకు ఏమైనా దానం చేస్తారా? నేను అందరికన్నా షావుకారును, నేను పేదవారికి దానమిస్తాను. ఇప్పటి షావుకార్లు అయితే తమ ధనము, తమ ఫ్యాషన్ యొక్క నషాలోనే నిమగ్నమై ఉన్నారు.

అచ్ఛా - బాబా అర్థం చేయిస్తారు, ఇది ఇంద్రప్రస్థము, ఇక్కడ హంసలు ముత్యాలను గ్రోలుతాయి. ఇకపోతే ఎవరైతే కొంగలుగా ఉంటారో, వారు రాళ్ళనే ఏరుకుంటారు, అందుకే బాబా అంటారు - ఇక్కడకు హంసలే (గుణగ్రాహకులే) రావాలి, కొంగలు (అవగుణాలను చూసేవారు) కాదు. అచ్ఛా!

మధురాతి-మధురమైన ఆత్మిక పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. తండ్రి శ్రీమతంపై నడుస్తూ దేహీ-అభిమానులుగా అయి తండ్రి కంఠ హారముగా అవ్వాలి. తండ్రి స్మృతిలో ఉంటూ

అతీంద్రియ సుఖాన్ని అనుభవం చేయాలి.

2. ఈ ప్రపంచము నుండి పూర్తి నష్టోమోహులుగా అవ్వాలి. ఎవరి అశుద్ధమైన శరీరాలనూ స్మృతి చేయకూడదు.

వరదానము:- సేవ యొక్క బంధనం ద్వారా కర్మ బంధనాలను సమాప్తం చేసే విశ్వసేవాధారీ భవ

ప్రవృత్తిలో ఉంటూ ఎప్పుడూ ఇది లెక్కాచారము, కర్మ బంధనము... అని అనుకోకండి. ఇది కూడా ఒక సేవయే. సేవ యొక్క బంధనంలో బంధింపబడటం ద్వారా కర్మ బంధనము సమాప్తమైపోతుంది. ఎప్పటివరకైతే సేవా భావము ఉండదో, అప్పటివరకు కర్మ బంధనము లాగుతుంది. కర్మ బంధనముంటే దుఃఖము యొక్క అల వస్తుంది మరియు సేవా బంధనముంటే సంతోషముంటుంది, అందుకే కర్మ బంధనాన్ని, సేవ యొక్క బంధనంతో సమాప్తం చేయండి. విశ్వ సేవాధారులు విశ్వంలో ఎక్కడ ఉన్నా విశ్వ సేవ కోసమే ఉంటారు.

స్లోగన్:- మీ దైవీ స్వరూపం యొక్క స్మృతిలో ఉంటే మీపై ఎవరి వ్యర్థ దృష్టి పడదు.